క్లుప్తంగా

పాఠశాలకు విరాళం



పాఠశాలకు బీరువా, కుర్చీలను విరాళంగా అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చంద్రగిరి: ఆనాటి విద్యార్థులు నాడు తాము చదువుకున్న పాఠశాలను చూసి తీపి గుర్తులను నెమరేసుకున్నారు. సుమారు 26 ఏళ్ల తరువాత వారంతా ఆదివారం కలసి ఉపాధ్యాయులతో కలిసి సందడి చేశారు. మండల పరిధిలోని పన పాకం జిల్లా ఉన్నత పాఠశాలలో 1999–2000 చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. అనంతరం వారు పాఠశాలకు రూ.25 వేలు విలువ చేసే బీరువా, 12 కుర్చీలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు రామచంద్రయాదవ్, సుదర్శన్ నాయుడు, చంద్రమౌళి గుప్తా, చక్రధర్, పట్టాభి, ఈశ్వర్ నాయుడు, హరి నాయుడు, ప్రసాద్, దామోదర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు

పాకాల : రాష్ట్రప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని బీటీఏ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో బీటీఏ మండల అధ్యక్షుడు కె.జ్యోతి ప్రసాద్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కె.రామచంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామ్మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పదవీ విరమణ చెందిన వారికి అక్టోబర్ 2024 నుంచి రావలసిన ఆర్థిక ప్రయోజనాల్లో కమ్యూటేషన్ మాత్రమే ఇచ్చి గ్రాట్యుటీ, సరెండర్ లీవ్, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐసీ, జీఐఎస్‌లను ఇంతవరకు విడుదల చేయలేదని, ప్రభుత్వం 8 నెలలుగా నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. 2023 పీఆర్సీ గడవు పూర్తయినా.. ఇంతవరకు 12వ పీఆర్సీ కమిటీని నియమించకపోవడం శోచనీయమన్నారు. కమిటీని ఏర్పాటు చేసి ఐఆర్ 30 శాతం విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనతో అలరిస్తున్న కళాకారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా చెన్నైకి చెందిన రుద్ర నాట్య సమర్పణ, నాట్యాచార్యులు శర్మిత ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. ఇందులో భాగంగా పుష్పాంజలి, శ్రీవిఘ్నరాజం భజే, గణేష కవుతువం, కీర్తనై, తేనమంగు, మంగళం వంటి పాటలకు కళాకారులు యశిక, శివరంజని, సంజనశ్రీ, జయశ్రీ, అవంతిక అనామిక, సయ్యద్ ఆరిఫా, అశ్వత్ గంగన, హరిప్రియ చూడచక్కని హావభావాలతో నాట్య ప్రదర్శన చేశారు. వారి అభినయానికి మంత్రముగ్ధులైన ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. అనంతరం ఏఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

శాస్త్రోక్తంగా విద్యార్థి వ్రత హోమం



రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో విద్యార్థుల వ్రత హోమం చేపడుతున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో ఆదివారం విద్యార్థులతో సంస్కార శిబిరంలో భాగంగా విద్యార్థి వ్రత హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సత్ప్రవర్తన, విద్యాభివృద్ధి కలిగించాలనే సంకల్పంతో ఆశ్రమ నిర్వాహకులు హోమం చేపట్టారు. ఇందులో భాగంగా మంగళ హారతి, శ్రీరామకృష్ణ సుప్రభాతంతో వ్రత కార్యక్రమం ప్రారంభించారు. వ్రత హోమంలో సంకల్ప మంత్రం జపిస్తూ బిల్వ పత్రాలతో హోమం చేపట్టి అగ్నికి ఆహుతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. అంతేకాక యోగా, భక్తి, కర్రసాము, ఆర్చరీ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చి విద్యార్థులు నూతన ఉత్సాహంతో మంచి భవిష్యత్‌ను ఎంపిక చేసుకునేలా తయారు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్కార శిబిరం సంచాలకుడు స్వామి సత్యస్థానంద, పూజారి స్వామి హరికృపానంద, విశ్వరాజానంద, గీత, హిమబిందు, సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతంగివే.. మమ్మేల రావే..

- వేడుకగా గంగమ్మ జాతర
- భక్తజనంతో కిక్కిరిసిన తాతయ్యగుంట ఆలయం
- పూజలందుకున్న మాతంగి వేషాలు
- నేడు సున్నపు కుండల వేషాలు



అమ్మవారి ఆలయం వద్ద భక్తజనం

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ గంగజాతరలో భాగంగా ఐదవ రోజు ఆదివారం భక్తుల సందడితో ఆలయం కిటకిటలాడింది. కరుణించి కాపాడు.. గంగమ్మ తల్లీ... అంటూ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కైకాల కులస్తులు మాతంగి వేషం ధరించి నగరంలో భక్తుల ఇంట పూజలు అందుకున్నారు. స్థానిక భక్తులు సైతం మాతంగి వేషాలు ధరించి తిరుపతి నగర వీధుల్లో డప్పుల దరువుల మధ్య చిందులు వేస్తూ విహరించారు. జాతర మొక్కుబడిలో భాగంగా వందలాది మంది భక్తులు వివిధ జానపద వేషధారణలు, పలువురు పురుషులు స్త్రీ వేషధారణల్లో నగరంలో సందడి చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు గంగబొట్లు పెట్టుకుని, వేపాకు నడుముకు కట్టుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. పొంగళ్లు వండి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌కు విశేష పూజలు చేసి మాతంగి అలంకరణలో కొలువు దీర్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే నగరపాలిక కమిషనర్ నారపురెడ్డి మౌర్య అమ్మవారికి సారె సమర్పించారు.

నేడు కుండల వేషాలు..

జాతరలో భాగంగా ఆరో రోజు సోమవారం ఇద్దరు కైకాల కులస్తులు సున్నపు కుండల వేషాలు ధరిస్తారు. ఈ ఇద్దరు పెద్దగంగమ్మ, చిన్నగంగమ్మలకు ప్రతీకలుగా పూజలు అందుకుంటారు.



పుష్పలంకరణలో శ్రీ తాతయ్యగుంట గంగమ్మ తల్లి

నేటి అర్ధరాత్రి గంగమ్మకు ప్రత్యేక అభిషేకాలు..

అమ్మవారి జాతర చాటు మొదలు మాతంగి వేషం రోజు వరకు విభిన్నరీతుల్లో చిత్ర విచిత్ర వేషధారణలతో అలసిన గంగమ్మతల్లిని శాంతింపజేసేందుకు సోమవారం అర్ధరాత్రి 12.15 గంటలకు ప్రత్యేక అభిషేకం చేస్తారు. ఇందులో క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, నారికేళ జలాభిషేకం, పసుపు నీటితో అభిషేకం ఇలా అనేక మంగళ ద్రవ్యాలతో అభిషేకం చేస్తారు. అనంతరం అర్చకులు అమ్మవారికి విశేష పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు.







అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు, ఆలయం ముందు పొంగళ్ళు వేసి అమ్మవారికి మొక్కుతున్న భక్తులు, సారె సమర్పిస్తున్న కమిషనర్ మౌర్య దంపతులు

నోటీస్ బోర్డు

- శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా సున్నపు వేషాలలో భక్తుల పూజలందుకోనున్న కైకాల కులస్థులు, అర్ధరాత్రి 12.15 గంటలకు గంగమ్మ తల్లికి శాంతి అభిషేకం
- పౌర్ణమి సందర్భంగా బుద్ధ ధర్మ విహార్‌లో ఉదయం 8 గంటలకు బుద్ధ జయంతి వేడుకలు
- రాముల వారి దక్షిణ మాడవీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో సాయంత్రం 6.45 గంటలకు రమా సహిత సత్యనారాయణవ్రత పూజలు
- తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి వసంతోత్సవాల్లో భాగంగా ఉదయం 9.45 గంటలకు అమ్మవారి స్వర్ణ రథం ఊరేగింపు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో ఉమ్మవారి ఉత్సవర్లకు తిరుమంజనం
- శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు నవ కలశ స్నపన తిరుమంజనం, అనంతరం 10 నుంచి 12 గంటల వరకు పత్ర పుష్పయాగం

ఘనంగా జాతీయ సాంకేతిక దినోత్సవం



సాంకేతిక విజ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా వివరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన 4, 5, 6వ తరగతి విద్యార్థులకు విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆవిష్కరణలపై అవగాహన కల్పించారు. ప్రయోగాత్మకంగా అధ్యయనం, జనరేటర్ ద్వారా యాంత్రిక శక్తి విద్యుత్ శక్తిగా మారడం ఎలా జరుగుతుందో వివరించారు. అలాగే దైనందిన జీవితంలో ఈ సూత్రాలు ఎలా ఉపయోగపడతాయనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ విద్యార్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

యద్భావం తద్భవతి పుస్తకావిష్కరణ



యద్భావం తద్భవతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్య వక్తలు

తిరుపతి కల్చరల్: మూర్తిమత్వం, వ్యక్తిత్వం పెంపొందాలంటే ఆధ్యాత్మిక కథలు చదవాలని ఎస్వీ వేద విశ్వ విద్యాలయం ఉప కులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి తెలిపారు. ప్రముఖ కథా రచయిత ఆర్‌సీ కృష్ణస్వామి రాజు రచించిన యద్భావం తద్భవతి పుస్తకావిష్కరణ సభ ఆదివారం రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పంచ సహస్రవాధాని డాక్టర్ మేడసాని మోహన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకంలో ప్రతి కథ జీవన ప్రయాణానికి కావాల్సిన జాగ్రత్తలు బోధిస్తాయన్నారు. సురేష్ పిళ్ళై ప్రవచనకర్త గరికపాటి రమేష్ బాబు పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో ఆకాశవాణి విశ్రాంత సంచాలకుడు మల్లేశ్వరరావు, రామకృష్ణ మిషన్ ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద, ఏనుగు అంకమనాయుడు, గాలి గుణశేఖర్ నాయుడు, రమాకాంత్ శర్మ, సర్వోత్తమరావు, చెన్నకేశవులు నాయుడు పాల్గొని రచయిత కృష్ణస్వామి రాజును అభినందించారు.

లూపస్ వ్యాధిపై అప్రమత్తత అవసరం



వాకర్స్ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దామోదరం

తిరుపతి కల్చరల్: లూపస్ నివారణ లేని చర్మ వ్యాధి అని, అందరూ అప్రమత్తంగా ఉంటూ వ్యాధి నివారణకు దోహదపడాల్సిన అవసరం ఉందని శుభోదయ హాస్పిటల్ అధినేత డాక్టర దామోదరం తెలిపారు. కరకంబాడి రోడ్డులోని వినాయక సాగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ లూపస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌కు లూపస్ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నివారణ లేని లూపస్ అనే చర్మ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏటా మే 10న జరుపుకుంటున్నామని తెలిపారు. లూపస్ అనేది మన వ్యాధి నిరోధక వ్యవస్థ మనపైనే దాడి చేయడంతో వచ్చే జబ్బు ఇది అన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ కృష్ణప్రసాద్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం రాజు, కార్యదర్శి చంద్రయ్య, వాకర్స్ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు



ఉత్తమ మార్కులు సాధించిన వారిని సత్కరిస్తున్న పద్మశాలి ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు

తిరుపతి అర్బన్: ఈ ఏడాది పదోతరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పద్మశాలి పురస్కారాలను ప్రదానం చేశారు. తిరుపతి నగరంలోని పద్మశాలి కల్యాణ మండపంలో ఆదివారం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలతో పాటు మెమెంటోలు, నగదు బహుమతులను అందించారు. పదో తరగతిలో గోలి మౌనిక (594), బోడగల వెంకటమోక్షిత(593), సామ సృజన(591), అవ్వారు రేవతి(591)కి, అలాగే ఇంటర్‌లో సింగంశెట్టి సంజన(988), శ్రీరామ రోహిత్(982), బోడ వైష్ణవి(981), పూల హేమంత్ కుమార్ (981), ఉద్దంటి పెంచల తేజశ్విని(981)ని అభిందించారు. కార్యక్రమంలో పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రాపర్తి వెంకట్రావ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామ నాగేశ్వర రావు, తిరుపతి నగర అధ్యక్షుడు సేపూరి రామ్మోహన్ రావు, తిరుపతి జిల్లా అధ్యక్షుడు శ్రీరామ పరంధామయ్య, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు జయ పెరుమాళ్, తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలు సందాల వాణి, నేతలు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసేవారు 0877–2227208 నంబరుకు కాల్ చేసి మాట్లాడవచ్చన్నారు. ఈ కార్యక్రమాలను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అపూర్వ కలయిక..

చంద్రగిరి: నాడు విద్యార్థులుగా ఉన్న వారంతా 23 ఏళ్ల తరువాత ఒకే వేదికపై మళ్లీ కలవడంతో ఆనందాల వేదికగా నిలిచింది. తిరుచానూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2001–2002 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా అదే పాఠశాలలో కలుసుకున్నారు. 23 ఏళ్ల తర్వాత పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఓ అపూర్వ సమ్మేళనంగా మారింది. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ప్రస్తుతం వారి అనుభవాలను పంచుకున్నారు. విందు భోజనం చేస్తూ, బాల్యంలోని విశేషాలను ముచ్చటించారు. అనంతరం అలనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు పాద పూజలు చేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు, హెచ్ఎం మురళి, పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.



తిరుచానూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఘనంగా మాతృ దినోత్సవం



మాతృమూర్తులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: రాముల వారి దక్షిణ మాడవీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అలాగే సేవాకేంద్రంలో నృసింహ జయంతి చేపట్టారు. మాతృమూర్తులను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రం అధినేత చిత్రపు హనుమంతరావు, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, సీఆర్‌కే శేషగిరిరావు, జయంత్‌కుమార్ పాల్గొన్నారు.

మాలల ఐక్యతతో హక్కులు సాధిద్దాం



ఐక్యత చాటుతున్న దళిత ప్రతినిధులు, మాజీ ఎంపీలు

తిరుపతి కల్చరల్: రాజకీయాలకు అతీతంగా మాలలంతా ఐక్యతతో ముందడుగు వేస్తూ హక్కుల సాధనకై కృషి చేయాలని ఎమ్మెల్యే వివేక్ పిలుపునిచ్చారు. రాయలసీమ మాలల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మంగళం రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో మాలల ఆత్మీయ గౌరవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఎస్సీ వర్గీకరణ చట్ట విరుద్ధమని గతంలో కోర్టులు సూచించినా, దీన్ని మళ్లీ పునరావృతం చేయడం విడ్డూరమన్నారు. అనంతరం మాజీ ఎంపీలు రెడ్డెప్ప, చింతామోహన్ మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను కాలరాసే ప్రభుత్వాలకు మాలలు సంఘటితంతో గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. ఎంపీ డాక్టర్ గురుమూర్తి హాజరై సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం నేత అశోక్‌బాబు, రాఘవ, రాయలసీమ మాలల జేఏసీ గౌరవాధ్యక్షుడు అశోక రత్నం, దళిత సంఘ నేతలు మల్లారపు మధు, దుగ్గాని జయరాం, తాళ్లపాక దాము, అంబేద్కర్ స్టార్ కృష్ణ, మాల ఉద్యోగులు, దళితులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్ రోడ్లపై విషపురాతలు



భూమన అభినయ్‌రెడ్డి నిర్మించిన చంద్రశేఖరేంద్ర సరస్వతి రోడ్డును చూపిస్తున్న నేతలు

తిరుపతి మంగళం : తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో గత 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లను నిర్మించి రాష్ట్రంతో పాటు ప్రపంచ నలుమూలల నుంచి శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు సైతం తిరుపతి వైపు చూసేలా అభివృద్ధి చేసిన ఘనత భూమన అభినయ్‌రెడ్డిదని వైఎస్సార్‌సీపీ నాయకులు అజయ్‌కుమార్, మద్దాలి శేఖర్ గుర్తు చేశారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లపై ఎల్లో పత్రిక ఈనాడు విషపురాతలు రాయడాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆటోనగర్ వద్ద నిర్మించిన చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి మార్గంలో నిలబడి అద్భుతంగా నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్డును వైఎస్సార్‌సీపీ నాయకులు చూపించారు. తిరుపతిలో భూమన అభినయ్‌రెడ్డి నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్లతో ట్రాఫిక్ సమస్యలు తీరాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా ఒక రోడ్డు నిర్మాణం కానీ, ఒక కాలువ నిర్మాణం చేపట్టిన పాపానపోలేదని మండిపడ్డారు. ఈనాడు పత్రికకు అవేమీ కనబడవా ? అని ప్రశ్నించారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేయాల్సిన మీడియా కూటమి ప్రభుత్వానికి కొమ్ము కాస్తూ వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిపై కూడా విషపురాతలు రాయడం సిగ్గు చేటన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లో చిన్నపాటి అభివృద్ధి కూడా చేసిన పాపానపోలేదన్నారు. ఆటోనగర్ వద్ద మాస్టర్‌ప్లాన్ రోడ్డు పక్కన మురుగునీరు రోడ్లపైకి వచ్చి ఏరులై పారుతున్నా అక్కడ కాలువ నిర్మాణం చేపట్టాలన్న ఆలోచన కూడా కూటమి ప్రభుత్వానికి, అధికారులకు లేదన్నారు. ఇప్పటికైనా ఎల్లో మీడియా వైఎస్సార్‌సీపీపై కాకుండా ప్రజల సమస్యలపై, నగర అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లవ్‌లీ వెంకటేష్, రుద్రగోపి, పసుపులేటి సురేష్, అనిల్‌రెడ్డి, సుబ్బు, మల్లం రవి పాల్గొన్నారు.

17న ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఈనెల 17 నుంచి జరుగనున్న ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలకు కార్మికులంతా జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో నగర, జిల్లా ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న యువత వ్యతిరేక విధానాలతో ఈ దేశంలో చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ శాఖలలో ఖాళీలు భర్తీ చేయడం లేదని, రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని తుంగలో తొక్కి దగా చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటు పరం చేయడం ద్వారా చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండాపోయి శ్రామికులుగా మిగిలిపోతున్నారని వాపోయారు. తిరుపతిలో జరిగే ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో అన్ని సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ఉద్యమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈ సభలకు దేశ వ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి సుమారు 1500 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు చెప్పారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ ప్రతినిధులు సీహెచ్ శివకుమార్, ఉదయ్ కుమార్, గోవిందస్వామి, శ్రీనివాసులు, మహేంద్ర, వెంకటేష్, సురేష్, ఏపీ.బాల, బాబు, నరసింహులు, కిషోర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ



హేమంత్ నానమ్మ మారియమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్/తిరుపతి మంగళం : తిరుపతి రూరల్ మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలకు చంద్రగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం పలువురు నేతల ఇళ్లకు వెళ్లి ఆత్మీయంగా పలకరించి, పరామర్శించారు. పద్మావతీపురం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత హేమంత్ నానమ్మ పి.మారియమ్మ గత నెల 29న మరణించడంతో ఆదివారం జరిగిన కర్మక్రియలకు హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం రామచంద్రాపురం మండలం సి.రామాపురానికి చెందిన నాయకులు గురుస్వామిరెడ్డి కుమారుడు ఉదయకిరణ్‌రెడ్డిని పరామర్శించారు. ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రాణిస్తున్న ఉదయ కిరణ్‌రెడ్డి అనంతపురం గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ ఆడుతుండగా ప్రమాదవశాత్తు గాయపడ్డారు. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అతన్ని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే సి.రామాపురం సర్పంచ్ పవన్‌కుమార్‌రెడ్డి బావ శ్రీహరికృష్ణ గత కొంతకాలంగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద ఉండగా అతన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే తిరుమలనగర్ పంచాయతీకి చెందిన గుండ్రాజు నితిన్‌వర్మ, లత దంపతుల కూతురు రాధ్య నామకరణ వేడుకల్లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.



సి.రామాపురంలో పార్టీ నేత గురుస్వామిరెడ్డి కుమారుడిని పరామర్శిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



శ్రీహరికృష్ణను పరామర్శిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి